క్లుప్తంగా

రూ.72 వేలు పలికిన లడ్డూ



వేలంలో లడ్డూ దక్కించుకున్న మధుసూదన్ రెడ్డి

పుల్లంపేట : వినాయక చవితి వేడుకలలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఆర్.గొల్లపల్లి గ్రామంలో వినాయకుని లడ్డూ వేలంపాట నిర్వహించారు. వేలంలో పోలి మధుసూదన్ రెడ్డి రూ.72వేలకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నాడు. అనంతరం స్వామివారి నిమజ్జనాన్ని డప్పువాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. యువకులు వసంతాలు చల్లుకుంటూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుండుపల్లెలో రూ.30,116లు



లడ్డూను దక్కించుకున్న నాగరాజు

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని పెద్దబలిజపల్లెలో వినాయకుని మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంపాటలో లడ్డూను ఏటిగడ్డ రాచపల్లెకు చెందిన అద్దేపల్లి నాగరాజు రూ.30,116 దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. అనంతరం దేవుని ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.

బాధ్యతల స్వీకరణ

గాలివీడు : మండలంలోని పలు గ్రామాలకు నూతన వీఆర్వోలుగా నియమితులైన వారు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటయ్య (కొర్లకుంట), గంగాధర్ (గోపనపల్లె), సుబ్బారాయుడు(అరవీడు), హేమలత(పూలికుంట) గ్రామాలకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

రాయలసీమ కాంగ్రెస్ పార్టీ రద్దుకు చర్యలు

గాలివీడు : గత ఆరేళ్లుగా రాయచోటి నియోజకవర్గ పరిధిలో చట్టసభకు ఎన్నికల్లో పోటీ చెయ్యని కారణంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జాబితా నుంచి రాయలసీమ కాంగ్రెస్ పార్టీ గుర్తింపును రద్దు చేయనున్నట్లు సహాయ ఎన్నికల నమోదు అధికారి తహసీల్దార్ భాగ్యలత ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలివీడు పట్టణంలో నివాసం వుంటున్న పార్టీ వ్యవస్థాపకులు కె.జలీల్ బాషాకు ఇదివరకే సమాచారం అందించామన్నారు. దీనిపై సెప్టెంబర్ 8లోపు ఆంధ్ర ప్రదేశ్ సచివాలయం వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి స్వయంగా వెళ్లి లిఖితపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాజంపేట : రాజంపేట మండలంలో ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్‌వివరాలను తెలుసుకుని ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను అమ్మాలని ఆదేశించారు. ఎరువులతోపాటు ఇతర వాటిని బలవంతంగా అమ్మరాదని హితవు పలికారు. యూరియను వేరే రాష్ట్రాలకు తరలించరాదన్నారు. లేకుంటే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. డీపీటీ ఎరువులు గోడౌన్‌లలో నిల్వచేసినప్పుడు కచ్చితంగా నంబరు అనేది ప్రతి ఒక్క బస్తాకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి మురళీకృష్ణ, వ్యవసాయాధికారి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై అప్రమత్తంగా ఉండాలి

పెనగలూరు : గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న భూ కబ్జాలపై వీఆర్‌ఏలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అమరేశ్వరీ అన్నారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ పంచాయతీలో అయితే భూ కబ్జాలు జరుగుతున్నాయో ఆ పంచాయతీ వీఆర్‌ఓ, వీఆర్‌ఏలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. అలాగే ఎక్కడైనా భారీగా మట్టి తరలిస్తున్నట్లయితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామ్మోహన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారాలు



ఆలయం చుట్టూ కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

వీరబల్లి : వంగిమళ్ల గ్రామం పెద్దూరు కస్బాలో వెలసివున్న శ్రీ ఎల్లమ్మతల్లి ఆలయం ఎదుట శుక్రవారం ఆలయ ప్రెసిడెంట్ ముసలయ్యగారి జనార్దన్ రెడ్డి ఆర్థిక సహకారంతో కాంక్రీట్ పనులు చేపట్టారు. ఆలయ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తనవంతు సహాయ, సహకారం ఉంటాయని జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

తెలుగు భాష వెలుగు మన గిడుగు

- హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్
- వేడుకగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు
- నివాళులర్పించిన టీచర్లు, విద్యార్థులు



పుల్లంపేట: తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలో విద్యార్థులు



సంబేపల్లెలో కవుల చిత్రపటాల ప్రదర్శన

సిద్దవటం : తెలుగు భాష వెలుగు మన గిడుగు అని, సువిశాల జలధార తెలుగు మాట – సుగుణాల పంచదార తెలుగు పాట అని 11వ ఏపీఎస్పీ బెటాలియన్ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు సమీర్ బాషా తెలిపారు. మండలంలోని బెటాలియన్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమీర్‌బాషా మాట్లాడుతూ అలాగే క్రీడలు స్నేహపూర్వక భావాన్ని, బృందస్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. క్రీడల వల్ల కలిగే లాభాలను గురించి విద్యార్థులకు తెలియజేశారు. అలాగే తెలుగు భాష గొప్పతనాన్ని గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సిరాజుల్లా, ఉపాధ్యాయులు యూనుస్, రవిశంకర్, నరసింహులు, రమణయ్య, షేక్ మౌలాలి, చంద్రశేఖర్, మాధవీలత, రాజమ్మ, పరమేశ్వరి, సునీత సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం నిర్వహించిన తెలుగు భాషా, క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి లంకాయ గారి నాగయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి పంతులు తెలుగు భాషకు గొడుగు వంటి వాడని, మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడా మాంత్రికుడిగా భారతదేశానికి ఎనలేని సేవలు అందించాడని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, తెలుగు ఉపాధ్యాయిని గీత, వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరీ, తెలుగులో పరిశోధక డాక్టరేట్ పట్టా పొందిన డాక్టర్ శర్వాణిలను డిప్యూటీ డీఈఓ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

తెలుగు భాష అమ్మవంటిది

గాలివీడు : తెలుగు భాష అమ్మవంటిదని, అలాంటి భాషను మరువకూడదని ప్రధానోపాధ్యాలు మహమ్మద్ జాఫర్ హుస్సేన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గిడుగు చిత్రపటానికి, అలాగే క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు తెలుగు పద్యాలు, పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, భాషా అంశాలపై పోటీలు, వివిధ తెలుగు ప్రాజెక్టు పనులలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

ఏయూలో జాతీయ క్రీడా దినోత్సవం

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ వేడుకను నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డా.నారాయణ, ఫిజికల్ డైరెక్టరు డా.నాగమునిలు పాల్గొని ప్రసంగించారు.

చదువుతోపాటు క్రీడలలో రాణించాలి

చిట్వేలి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడాలలో ప్రతిభ చూపి రాణించాలని ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠసాలలో మాతృభాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గిడుగురామ్మూర్తి తెలుగుభాషకు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని భాషా దినోత్సవంగా, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

దేశానికే వన్నె తెచ్చిన క్రీడాకారుడు ధ్యాన్ చంద్

రాయచోటి టౌన్ : భారతదేశానికి ఎంతో గొప్ప వన్నె తెచ్చిన హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ అని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి అన్నారు. శుక్రవారం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని హాకీ క్రీడారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడలో ఎన్నో విజయాలు సాధించి భారదేశానికి ఎంతో గౌరవం సాధించిపెట్టారన్నారు. అనంతరం వివిధ క్రీడలలో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఉర్దూ పాఠశాలలో..

పండితులకే పరిమితమైన తెలుగు గ్రాంధిక భాషను వాడుక భాషలోకి తీసుకొచ్చిన ఘనత గిడుగు వెంకట రామమూర్తిదేనని ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.మహమ్మద్ ఇలియాస్ అన్నారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా గిడుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయుడు విజయ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సిరాజ్, రియాజ్, ఓబులమ్మ, అమీరున్నిసా, ముస్తాక్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో శుక్రవారం తెలుగు భాష దినోత్సవ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది కవుల చిత్రపటాల ప్రదర్శనతో తెలుగు తల్లికి నీరాజనాలు పలికారు. తెలుగు బాష గొప్పతనం గురించి విద్యార్థులు పద్యాలరూపంతో పాటు నృత్య ప్రదర్శనతో అలరించారు.



నందలూరు: సత్కారం అందుకుంటున్న డిప్యూటీ డీఈఓ నాగయ్య, హెచ్‌ఎం వెంకటరమణ



రాయచోటి టౌన్: విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి



రాజంపేట: ఏయూలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి విద్యార్థుల నివాళి



చిట్వేలి: నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, బహుమతులతో విద్యార్థులు

నిమజ్జన వేడుకలో నిబంధనలు పాటించాలి



నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్ఐ సుధాకర్

చిన్నమండెం : వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలు నిమజ్జనోత్సవంలో తప్పక నిబంధనలు పాటించాలని చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గణపయ్య విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి మండల పరిధిలోని మండిపల్లి నాగిరెడ్డి రిజర్వాయర్‌ను ఎస్ఐ పరిశీలించారు. నిమజ్జనం చేసేందుకు పలు ప్రాంతాల నుంచి వచ్చే గణేష్ ప్రతిమలను దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. కాగా ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనం చేయనున్నట్లు తెలియవస్తోంది.

క్రీడాభివృద్ధికి సహకారం అభినందనీయం



దాత అందించిన క్రీడా దుస్తులు, పరికరాలతో టీచర్లు

సుండుపల్లె : క్రీడాకారుల ప్రతిభను గుర్తించి క్రీడాభివృద్ధికి సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు షకీరా బేగం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థి అమెరికాలో స్థిరపడ్డ తిమ్మసముద్రం వాసి తాతినేని బాలాజీనాయుడు పాఠశాల పీడీ రాధారాణి వినతి మేరకు రూ.40 వేలు విలువ చేసే క్రీడాకారుల దుస్తులు, హ్యాండ్ బాల్ క్రీడా పరికరాలను క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు.

ముదిరిన ఆలయ వివాదం

ములకలచెరువు : మద్దినాయునిపల్లి పంచాయతీ బూడిదగడ్డలో పురాతన శివాలయం వివాదం శుక్రవారంతో తారాస్థాయికి చేరింది. పండుగ రోజు పూజారి ఆలయానికి తాళాలు వేశారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని తిట్టారని తెలిపారు. గుడి మాన్యం ఆక్రమించుకొని దీప, ధూప నైవేద్యాలకు శివుడు నోచుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు విచారణ చేయాలని కోరారు.

రైతులను నిండా ముంచుతున్న దళారులు

బొప్పాయికి రూ.5 ధర ఇస్తున్న వ్యాపారులు

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు నియోజకవర్గంలో బొప్పాయి రైతులకు కలెక్టర్ నిర్ణయించిన రూ.10కి కాకుండా రూ.5కు కొంటున్న వ్యాపారులు, దళారులపై జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు లింగాల యానాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీన జిల్లా కలెక్టర్ ధామకూరి శ్రీధర్, అనంతరాజుపేట హార్టికల్చర్ కళాశాలలో రైతులు, వ్యాపారస్తులతో ధరల విషయమై సమావేశం నిర్వహించి ఐదవ తేదీ వరకు తొమ్మిది రూపాయలు, ఆరవ తేదీ నుంచి పది రూపాయలు కనీస ధర అమలు చేయాలని నిర్ణయించి ఆదేశించగా కొన్నిరోజులు తొమ్మిది రూపాయలు అమలు చేసి తిరిగి ఎనిమిది రూపాయలు, శుక్రవారం ఒక్కసారిగా ఐదు రూపాయలకు తగ్గించారని వారు వాపోయారు. ఇది దుర్మార్గమని విమర్శించారు. జిల్లా కలెక్టర్ సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని నాయకులు కోరారు.

సుగాలి ప్రీతి కుటుంబాన్ని ఆదుకుంది జగన్ ప్రభుత్వమే

రాయచోటి జగదాంబసెంటర్ : వైఎస్ జగన్ హయాంలోనే సుగాలి ప్రీతి కుటుంబానికి 5 ఎకరాల భూమి, 5 సెంట్ల ఇంటి స్థలం, ఉద్యోగం, నగదు అందించడం జరిగిందని వైఎస్ఆర్‌సీపీ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హరూన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలో ఆయన మాట్లాడారు. 2017 ఆగస్టు 19న సుగాలి ప్రీతి ఘటన జరగ్గా 2019 జూన్ వరకు చంద్రబాబు సీఎంగా ఉన్నారని అన్నారు. ఒకవేళ ఆధారాలు తారుమారై ఉంటే ఏడాది 9 నెలల కాలంలోనే అయ్యి ఉండాలని ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వాన్ని నిందించడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. సుగాలి ప్రీతి కేసులో దోషులకు శిక్ష పడే వరకు వదలబోను అని ప్రగల్భాలు పలికిన పవన్ కల్యాణ్ ఇప్పుడు తను ఆలోచించి మాట్లాడాలని.. అధికారంలో ఉన్నామని ఏది పడితే అది మాట్లాడలేనని చెప్పడం ఆ కుటుంబాన్ని ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆయన ఇచ్చిన మాటకు కట్టుబడి సుగాలి ప్రీతి కేసు నిందితులను కఠినంగా శిక్షించి కుటుంబసభ్యులకు అండగా నిలవాలని కోరారు.

రాజంపేట కేంద్రంగా జిల్లాను ప్రకటించాలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : రాజంపేట కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని టేబుల్ అజెండాగా చైర్మన్ పోలా ఆదేశాల మేరకు అధికారులు కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. దీంతో సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు ముక్తకంఠంతో ఆమోదం తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలను కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టారు. అందులో పాతబస్టాండులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు పక్కన మున్సిపాలిటీకి సంబంధించిన స్థలం చుట్టూ రూ.4.90 లక్షలతో మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా కాని అందుబాటులో ఉన్న నిధులతో ప్రహరీ నిర్మించాలని తీర్మానించారు. అక్కడి స్థలంలో మున్సిపాలిటీకి సంబంధించి ఒక ఇంచు స్థలం కూడా వదలకుండా ప్రహరీని నిర్మించాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. పాత బస్టాండులోని మున్సిపాలిటీకి సంబంధించిన స్థలంలో ఉన్న పాత భారత్ పెట్రోల్ బంకు స్థానంలో కొత్తగా భారత్ పెట్రోల్ బంకు ఏర్పాటుకు యాజమాన్యం నెలకు రూ.40 వేలు బాడుగ, ఐదు సంవత్సరాలకు ఒకసారి 15 శాతం బాడుగ పెంపు, 30 సంవత్సరాలు లీజుకు ఇవ్వాలని కోరిన విషయమై చర్చ జరగగా, చైర్మన్ నెలకు రూ.55 వేలు బాడుగ, 20 సంవత్సరాలపాటు లీజు, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకమారు 15 శాతం బాడుగ పెంచే నిబంధనలతో లీజుకు ఇచ్చేందుకు నిర్ణయించిన విషయాన్ని సమావేశంలో తెలపగా కౌన్సిలర్లు అంగీకారం తెలిపి ఆమోదించారు. బ్లీచింగ్ కొనుగోలుకు దాదాపు మూడు లక్షల రూపాయలు జనరల్ ఫండ్ కింద నిధులు ఖర్చు చేసే విషయమై సమావేశంలో పెట్టగా టెండర్ల ద్వారానే బ్లీచింగ్ కొనుగోలు ప్రక్రియ జరగాలని చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే పలు అజెండాలో పొందుపరిచిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు సమస్యలు పరిష్కరించకుంటే వార్డు పరిధిలో ఉండే కౌన్సిలర్లు ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఉంటుందని చెప్పుకొచ్చారు. అందువల్ల కౌన్సిలర్ల ఫిర్యాదులను ప్రత్యేక దృష్టితో చూడాలని తెలియజేశారు.

వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం



డాక్టర్ తౌసిఫ్

పెనగలూరు : మండలంలో వర్షాలు కురుస్తున్నందున వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని డాక్టర్ తౌసిఫ్ పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో వైరల్ జ్వరాలు అధికంగా వచ్చే అవకాశం ఉందని, అందుకే ఇంటి చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతిరోజూ నీటిని వేడిచేసి తాగాలన్నారు. మీ చుట్టు పక్కల నీరు నిల్వ ఉన్నట్‌లెతై నిల్వ ఉన్నచోట ఫినాయిల్ లేదా బ్లీచింగ్ లేదా కిరోసిన్‌ను చల్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైరల్ జ్వరాలు సోకితే ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

జ్వర లక్షణాలుంటే చికిత్స పొందాలి

ఓబులవారిపల్లె : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముక్కవారిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం జ్వరాలు, దగ్గు, ఆయాసంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పూల కుండీలు, పాత టైర్లలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, జ్వరం వచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. జ్వరం ఉంటే అశ్రద్ధ చేయకుండా ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. వ్యాధులపట్ల నిర్లక్ష్యం వహించకుండా చికిత్స పొందాలని సూచించారు.

ప్రభుత్వ వైఖరితో డీఎస్సీ అభ్యర్థుల్లో ఆందోళన

రాయచోటి జగదాంబసెంటర్ : డీఎస్సీ అభ్యర్థులతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం రాయచోటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాల్ లెటర్లతో కేంద్రాల వద్దకు వెళ్లిన వారికి సర్కార్ టెస్టింగ్ షాక్ ఇచ్చినట్లు తెలిపారు. ముందు రమ్మని.. తర్వాత కాదు పొమ్మనడంతో అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళనలో అభ్యర్థులు ఉన్నారన్నారు. డీఎస్సీ పరీక్ష పారదర్శకతపై అభ్యర్థుల్లో సవాలక్ష సందేహాలు నెలకొన్నాయన్నారు. రాత్రికి రాత్రే అభ్యర్థుల లాగిన్‌లో కాల్ లెటర్లు మాయంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. వెరిఫికేషన్ కేంద్రాల్లో వెనక్కి పంపుతుండటంతో చేతిదాకా వచ్చిన కొలువు చేజారుతోందని గుండె బేజార్ అవుతోందన్నారు. నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ అభ్యర్థులకు కాల్ లెటర్స్ చేరలేదని తెలిపారు. అసలు ఎంపికయ్యారో లేదో తెలియని దుస్థితిలో ఉద్యోగార్థులు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరుగుతుందా లేదా అని అయోమయంలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని విజయభాస్కర్ తెలియజేశారు.

కొనసాగుతున్న పూజలు.. కోలాహలంగా నిమజ్జనోత్సవాలు

గత మూడు రోజులుగా గణనాథుడు విశేష పూజలు అందుకుంటుండగా పలు ప్రాంతాల్లోని గణనాథులను ఆయా ఉత్సవ కమిటీలు శుక్రవారం ఘనంగా నిమజ్జన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు దారి పొడవునా పెద్దఎత్తున బాణాసంచా పేల్చుతూ, బ్యాండు వాయిద్యాలను అనుగుణంగా నృత్యాలు చేస్తూ సాగారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. ఇదిలావుంటే గణనాథుని ఉత్సవాలను పురస్కరించుకొని అనేక ఉత్సవ కమిటీలు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశాయి. పలు ఉత్సవ కమిటీలు ఆధ్యాత్మికతతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గణనాథులు కొలువైన ప్రాంతాల్లో భక్తిభావంతో పాటు ఆనందభరితమైన వాతావరణం నెలకొంది.

– రాజంపేట టౌన్



ఓబులవారిపల్లె: బెస్తపల్లి గ్రామంలో..



రాజంపేట టౌన్: అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



రాయచోటి టౌన్: కొత్తపేటలోని శ్రీరామాలయం వద్ద కొలువైన గణనాథుడు



సిద్దవటం: నిమజ్జనాన్ని తిలకిస్తున్న భక్తులు



ఓబులవారిపల్లె: గోవిందంపల్లి చెరువు వద్ద నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



వీరబల్లి: మండల కేంద్రంలోని వినాయకుని మండపం వద్ద అన్నదానం



నందలూరు: ఆర్‌ఎస్ రోడ్డులో అన్నదానం



గాలివీడు: గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న సినీ నటీనటులు



చిట్వేలి: రాజుకుంట గ్రామంలో నిమజ్జనోత్సవం



సంబేపల్లె: వసంతాలు చల్లుకుంటూ నిమజ్జనంలో పాల్గొన్న యువత

వాడుక భాష మూలపురుషుడు గిడుగు రామ్మూర్తి



గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌లకు నివాళులర్పిస్తున్న ఏపీఎంఎస్ ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లి : తెలుగు భాషకు మూలపురుషుడు గిడుగు వెంకటరామ్మూర్తి అని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయుడు రాజశేఖర్‌లు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లోని వ్యవహారిక భాషా ఉద్యమానికి మూల పురుషుడు గిడుగురామ్మూర్తి అని, ఆయన బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది అని కొనియాడారు. గ్రాంధిక భాషలోని తెలుగు వచనాన్ని ప్రజలకు వాడుకభాషలోకి తీసుకొచ్చిన మహనీయుడని, ధ్యాన్ చంద్ సుప్రసిద్ధ భారతీయ హాకీ క్రీడాకారుడని, ప్రపంచ అత్యుత్తమ క్రీడకారుల్లో ఒకరని కీర్తించారు.